గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

సాలూరు రూరల్:

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్మరాజుపేట గ్రామంలో గ్రామంలో ఇంటిఇంటికీ సేకరించిన చెత్తను గ్రామ ప్రధాన రహదారిలో గల కూరగెడ్డలో నింపుతున్నారు. అలాగే గ్రామ పొలిమేరలో రోడ్డుకు ఇరువైపులా మలవిసర్జనతో గ్రామం నిత్యం కంపుకొడుతోంది. అదే దారిలో నిత్యం ఆ గ్రామ ప్రజలతో పాటు పునికినవలస గ్రామస్తులు తిరుగుతుంటారు. గ్రామంలో సేకరించిన చెత్తను కూరగెడ్డలో నింపడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూరగెడ్డను ఉపాధి హామీ పనిలో భాగంగా ప్రతిఏటా పూడికలు తీయడంతో పాటు పేరుకుపోయిన చెత్తను తొలగిస్తుంటారు. అసలు అధికారులు ఏమేరకు నిర్లక్ష్యంగా ఉన్నారో ఈ ఒక్క పనితీరు చూస్తే అర్థమవుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే బాగువలస గ్రామంలో కూడా ఇదే పరిస్థితి. గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను సాలూరు నుంచి మక్కువ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పోగులు వేస్తున్నారు. అలాగే వాటిని తగుల పెట్టడంతో నిత్యం రహదారి వెంబడి ప్రయాణించే ప్రయాణికులు ఆ వ్యర్థాల పొగను పీల్చుకుంటూ వెళ్లడం సర్వసాధారణంగా మారింది.

ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా చెత్త పోగులు

మామిడిపల్లి గ్రామం పరిస్థితి అయితే వేరే చెప్పనవసరం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తలు పూర్తిగా ప్రభుత్వ ఆస్పత్రికి ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా పోగులు వేస్తున్నారు. అలాగే ఆస్పత్రి వెనుక కూడా వ్యర్థాలను వేస్తున్నారు. అంతటితో ఆగకుండా వాటిని తగులపెడుతున్నారు. అసలే అనారోగ్యంతో వచ్చిన రోగులకు ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వాసన పీల్చితే ఎంత ప్రమాదకరమో వేరే చెప్పనవసరం లేదు. మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో సేకరించిన చెత్తను, ఊరి ముఖద్వారం వద్ద పోగులు వేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తగలపెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలు మంటపెడితే దానినుంచి వచ్చిన పొగ చాలా ప్రమాదకరమని ఒకవైపు అధికారులే ప్రచారం చేస్తుంటారు. గ్రామాల్లో ప్రభుత్వ పోరంబోకు భూములు చాలావరకు అందుబాటులో ఉంటాయని సేకరించిన చెత్తను ప్రత్యేకంగా ఆయా ప్రదేశాల్లో వేస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.




గ్రామంలో సేకరించిన చెత్తను కూరగెడ్డలో వేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు, (ఇన్‌సెట్లో) బాగువలస వద్ద ప్రధాన రహదారి పక్కన వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజలకు అండగా నిలుస్తా



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి

- అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి

పార్వతీపురంటౌన్: నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని అరకు పార్లమెంట్ ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజా రాణి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్వగృహం వద్ద పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు తనకు ఎంపీ సీటు కేటాయించడంలోను, తనను రాజకీయంగా ప్రోత్సహించడంలోను మాజీ ఎమ్మెల్యే జోగారావు అందరికంటే ముందు నిలిచారన్నారన్నారు. అలాగే నాడు పార్వతీపురం ప్రజలు కూడా అండగా నిలిచి ఎంపీగా గెలిపించినందుకు అందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. జోగారావుతో పాటు తాను కూడా అందరికీ తప్పకుండా అందుబాటులో ఉంటానని, మీకు ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను అండగా నిలవనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మూడు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అపరాలపంటలపై రైతులు జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: మండలంలోని వరి మాగాణీ భూముల్లో రైతులు సాగు చేసిన అపరాల పంటలకు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంఏఓ అవినాష్ అన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది సదస్సుల్లో భాగంగా బుధవారం వెన్నెల బుచ్చింపేటలో అపరాల పటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము, పెసర పంట దశలోనే జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. అలాగే అపరాల మొక్కలున్న మడులలో కలుపు మొక్కలు ఎక్కువగా ఉండడంతో మొక్కల ఎదుగుదలకు అడ్డుపడే కలుపు మొక్కలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీష్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

క్లుప్తంగా

చినభోగిలిలో గోవింద నామ జపం



చినభోగిలిలో గోవిందనామాలు ఆలపిస్తున్న బక్కుపేట భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా బుధవారం వేకువజామున చినభోగిలి గ్రామంలో బక్కుపేట గ్రామానికి చెందిన గోవిందమాల ధరించిన భక్తులు మేలుకొలుపులు, గోవిందనామాలతో తిరువీధి చేశారు. అలాగే ఇప్పటికే బుడ్డిపేట, పెదభోగిలి, సీతానగరం, కేఎస్ పురం గ్రామాల్లో గోవింద మాలలు ధరించిన భక్తులు వేకువ జామున గోవింద నామాలు ఆలపిస్తున్నారు.

లైంగిక దాడుల నిర్మూలనే ధ్యేయం

వీరఘట్టం: బాల్య వివాహాలు, లైంగిక దాడుల నిర్మూలనే ధ్యేయంగా మహిళా సంక్షేమ శాఖ పనిచేస్తోందని మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల కంప్రెషన్ ఆఫీసర్ పి. శ్రీధర్ తెలిపారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు గుడ్‌టచ్/బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ మ్యారేజ్, పీటీసీఎస్‌ఓ పోక్సో చట్టం, పిల్లల హక్కులు, గుడ్/బ్యాడ్ టచ్‌పై వివరించారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అప్పుడే భారతదేశంలో కిశోర వికాసం వస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు, మహిళా శిశు సంక్షేమ శాఖ పాలకొండ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ, హైస్కూల్ ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



రహదారి పరిధిలో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

గరుగుబిల్లి: రహదారి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి – పార్వతీపురం ఆర్అండ్‌బీ రహదారి పరిధిలో గొల్లవానివలస మలుపు వద్ద సూచిక బోర్డును సరిచేయడంతో పాటు రహదారి పరిధిలో వున్న పిచ్చిమొక్కలను బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారికి ఇరువైపుల వున్న పిచ్చి మొక్కలు కారణంగా వాహన చోదకులకు రహదారి పూర్తి స్థాయిలో కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహన చోదకులు రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈయనతో పాటు సిబ్బంది అచ్యుతరావు తదితరులున్నారు.

గ్యాస్ సిలిండర్ల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: గ్యాస్ సిలిండర్ల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక సిబ్బంది ఎం.తిరుపతిరావు, ఎ.తిరుపతినాయుడు, పి.గౌరీశంకరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ గొడాం వద్ద స్థానికులకు గ్యాస్ ప్రమాదాలు, వాటి నివారణ చర్యలపై బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్యాస్ గొడాం నిర్వాహకులు కొండగొర్రి సంఘంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



విద్యార్థుల నుంచి విషయ సేకరణ చేస్తున్న డీఈఓ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ డాక్టర్ నల్ల తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం 8.30 గంటలకు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించి, విద్యాభివృద్ధి పట్ల విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలనే సంకల్పంతో ప్రతివిద్యార్థితోనూ ముఖాముఖి చర్చించి పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధమవాలో సూచించారు. అనంతరం ప్రార్థన సమయంలో విద్యార్థులందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదవాలని పిలుపునిచ్చారు.

6వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థుల నోట్సులు పరిశీలించి వివిధ సబ్జెక్టులలో ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. అనంతరం బడితోటలో ఉన్న మొక్కలను, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఎంఈఓ జి. సూరిదేముడు, ఎంఈఓ-2 ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ ప్రతినిదులు పాల్గొన్నారు.

పెదమేరంగి హైస్కూల్‌లో పానెల్ ఇన్‌స్పెక్షన్



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి ఉన్నత పాఠశాలలో బుధవారం పానెల్ ఇన్‌స్పెక్షన్ జరిగింది. కురుపాం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు ఆధ్వర్యంలో ఏడుగురు సబ్జెక్ట్ ఉపాధ్యాయుల పాల్గొన్నారు. అన్ని తరగతుల విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సమీక్షించారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పరిశీలించిన వివరాలను సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు.

డిప్యూటీ ఈఓ. పాఠశాల సందర్శన

పాలకొండ డిప్యూటీ ఈఓ కృష్ణమూర్తి 10వ తరగతి విద్యార్థుల సిలబస్, నోట్ పుస్తకాలు, పరీక్షలకు సన్నద్ధత తీరును అడిగి తెలుసుకున్నారు. పరీక్షల విభాగానికి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్వంసమైన పంటలు

- ఆవేదనలో రైతులు
- తూతూమంత్రంగా అటవీశాఖ చర్యలు



ఏనుగులు ధ్వంసం చేసిన నాగిరెడ్డి సత్యం నాయుడు వరిచేను కుప్పలు

కొమరాడ:

2018 సెప్టెంబర్ నెలలో వచ్చిన అటవీ ఏనుగుల గుంపు వలన ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం జరుగుతున్నప్పటికీ పాలకుల పరిష్కార చర్యలు కానరావడం లేదు. ఈ ఆరేళ్లలో సుమారు 14 మంది ఏనుగుల దాడిలో మృతిచెందగా..వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. ఈ మేరకు కొమరాడ మండలంలోని కళ్లికోట, దుగ్గి, గుణానుపురం, కుమ్మరిగుంట, గంగరేగువలస తదితర గ్రామాల్లో రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న కూరగాయల పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం కూడా ఏనుగుల గుంపు రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన నగిరెడ్డి సత్యం నాయుడు, గొర్లి గౌరీశ్వరరావు, సింహాచలం తదితరులు టమాటో, వరి, అనప, జొన్న పంటలను ధ్వంసం చేశాయి. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్ప నష్టపరిహారం మంజూరుకు చర్యలు చేపట్టడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

నష్టపరిహారం మంజూరు చేయాలి

ఏనుగుల గుంపు ధ్వంసం చేయడం వల్ల సాగు చేస్తున్న టమాటో పంట నాశనమైంది. కూరగాయాల సాగే వృత్తిగా భావించి జీవనం సాగిస్తున్నాం. ఏనుగుల వల్ల పంట పూర్తిగా నాశనమైంది. అటవీశాఖ అధికారులు స్పందించి జరిగిన నష్టానికి పరిహారం అందజేసి ఆదుకోవాలి.

– గొర్లి గౌరీశ్వరరావు, రాజ్యలక్ష్మీపురం. కొమరాడ మండలం



ఏనుగులు ధ్వంసం చేసిన టమాటో పంటను చూపిస్తున్న గొర్లి గౌరీశ్వరరావు

విద్యా ప్రమాణాల పెంపుదలకు కృషి చేయాలి



గుడివాడకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. గుడివాడకాలనీ ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పర్యవేక్షించి వారి నైపుణ్యాలను గుర్తించారు. ప్రాథమికస్థాయి విద్యార్థులకు రాత, చదువు వచ్చేందుకు ప్రాముఖ్యం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. మంచి దస్తూరి అలవాటు చేయాలని సూచించారు. మంచి నాణ్యమైన విద్యను అందించి, విద్యా ప్రమాణాల పెంపుదలకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. విద్యార్థుల్లో అన్ని రంగాలలో నైపుణ్యం పెరిగేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించాలని సూచించారు. మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బూర్జ చిన్నమ్మవారి జాతర



పాత బూర్జలో అమ్మవారి ఘటంతో గుడికి వెళ్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు.



కొత్త బూర్జనుంచి గుడికి మేళతాళాలతో వెళ్తున్న అమ్మవారు

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో గ్రామ దేవత చిన్నమ్మవారి జాతర అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కొత్తబూర్జ, పాత బూర్జ గ్రామాలకు చెందిన వారు ఎక్కడ ఉన్నా చిన్నమ్మవారిని దర్శించుకోవలసిందే. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, ఆయుష్ రీజనల్ వైద్యాధికారి డాక్టర్ జె.ధనుంజయ రావు, బూర్జ ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి హేమాక్షి, ఇతర శాఖల ఉన్నతాధికారులు, బంధువులు, అమ్మవారికి మొక్కుకున్న భక్తులు కలిసి 630 ఘటాలతో అమ్మవారిగుడి వరకూ బాజాభజంత్రీలతో తిరువీధి చేసి మొక్కులు తీర్చుకున్నారు.



దారి పొడవునా వందలాది ఘటాలతో భక్తులు

కందిపప్పు కొందరికే!..



కందిపప్పు

- సీతంపేట ఏజెన్సీలో 20 శాతం మంది లబ్ధిదారులకు అందని సరుకు
- 8 రేషన్‌డిపోలకు కందిపప్పు సరఫరా నిల్
- ఆందోళనలో లబ్ధిదారులు
- పండగపూట తప్పని అవస్థలు

సీతంపేట:

ఏజెన్సీలో పరిధిలోని రేషన్ డిపోల్లో తెల్లకార్డుదారులకు సబ్సిడీపై పంపిణీ చేయాల్సిన కందిపప్పును కూటమి సర్కార్ కొంతమందికే పరిమితం చేసింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కందిపప్పు ఈ నెలలో తమ డిపోలకు రాదంటూ డీలర్లు చేతులెత్తేస్తున్నారు. పొల్ల, టిటుకుపాయి, మానాపురం, దోనుబాయి, కిల్లాడ, తదితర 8 రేషన్ డిపోలకు 30 క్వింటాళ్ల వరకు కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. ఆయా డిపోల పరిధిలో సుమారు 2,500 వరకు తెల్లరేషన్ కార్డుదారుల కు కందిపప్పు సప్‌లై కాకపోవడం గమనార్హం. రేషన్ డిపోల ద్వారా కందిప ప్పు కిలో 67 రూపాయలకు సరఫరా చేస్తా రు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.170 వరకు ఉంది. సంక్రాంతి పూట కూడా సక్రమంగా సరఫరా చేయకపోతే ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటడంతో అవస్థలు పడుతున్నామన్నారు. కొద్దిరోజుల కిందటవరకు కందిపప్పు కొరత ఉండడంతో మార్కెట్లో కొనుగోలు చేయలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా ప్రభుత్వం రేషన్‌కార్డుదారులందరికీ కందిపప్పు ఇవ్వకపోవడంతో బయట మార్కెట్‌లో అత్యధిక ధరలకు కొనుగోలు చేయక తప్పని పరిస్థితి నెలకొంది.



ఇలా చేయడం తగదు..



లబ్ధిదారులకు పండగపూట కూడా కందిపప్పు సరఫరా చేయకపోతే ఎలా?. రెండు నెలలుగా పరిస్థితి ఇంతే. కొంతమందికి రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే మరికొందరికి ఇవ్వడం లేదు. సంక్రాంతికి పిల్లాపాపలు, బంధువులతో పండగ చేసుకునే వారు బయట కొనుగోలు చేయాలంటే కష్టమే. – నిమ్మక అరుణ, సర్పంచ్, టిటుకుపాయి

80 శాతం పంపిణీ చేశాం..

కొన్ని రేషన్ డిపోలకు కందిపప్పు సప్‌లై చేయని మాట వాస్తవమే. మాకు సరఫరా అయిన కందిపప్పును 80 శాతం వరకు పంపిణీ చేశాం. మిగిలిన 20 శాతం కందిపప్పు రాలేదు. వచ్చిన వెంటనే రేషన్ డిపోలకు సప్‌లై చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌బాబు, సివిల్ సప్‌లైస్ డీటీ

పంపిణీ చేయాలి..



ఇప్పటికై నా కందిపప్పు సప్‌లై చేయాలి. కేవలం మా పంచాయతీల పరిధిలోనే పంపిణీ చేయకపోవడం గమనార్హం. బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. ముఖ్యమైన కందిపప్పు ఇవ్వడం లేదు. రానున్న రెండు రోజుల్లోనైనా సరఫరా చేయాలి. – శివ, పొల్ల, లబ్ధిదారుడు

ప్రాధాన్యతా క్రమంలో పనులు



జీపీడీపీ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ తోయక సీతమ్మ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని లుంబేసు సర్పంచ్ తోయక సీతమ్మ అన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)కు సంబంధించి గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్‌లోని 29 అంశాలపై సమీక్ష నిర్వహించి ఆయా పనుల కోసం తీర్మానాలు చేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి చేపట్టిన తీర్మానాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం జరుగుతుందని సర్పంచ్ సీతమ్మ పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎం.గౌరమ్మ, గ్రామ సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.